బి. శ్రీవల్లీ రాధిక

# ప్రణయ కళారాధనలో..

ఆ ఏడుపు యింకా నా చెవులలో మారుమ్రోగుతూనే వుంది.

కెమిస్ట్రీ లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తూన్నాను. సుజన పరుగెత్తుకుంటూ వచ్చింది. "జ్యోత్స్నా! దివ్య హాస్టల్ బిల్డింగ్ మీద నుంచి దూకేసిందట. చచ్చిపోయింది." అంటూ.

మొదట అర్థం కాలేదు. అయోమయంగా వెనక్కి తిరిగి "ఎవరూ?" అన్నాను.

"దివ్య. నీ రూమ్మేట్. అందరూ వెళ్ళి చూస్తున్నారు..."

దాని మాటలు పూర్తి కాకముందే చేతిలోని బీకరు గాల్లో వదిలేసి కారిడార్‌లోకి పరిగెత్తాను.

హాస్టల్ అంత దూరంలో వుండగానే కనిపించింది పెద్ద గుంపు. ప్రిన్సిపాల్, వార్డెన్ అంతా అక్కడే వున్నారు.

అయినా.. అప్పటికి కూడా నాకా వార్త పూర్తిగా అర్థం కాలేదు. ఇంకేదో లోకంలో వున్నదానిలా అందరినీ తోసుకుంటూ ముందుకు నడిచాను. చివరి అమ్మాయిని కూడా తప్పించి తొంగి చూశాను. అంతే. తల గిర్రున తిరిగింది.

దివ్య వేసుకునే ఎర్ర ఓణీ.. గులాబి రంగు పరికిణీ.. చితికిపోయిన ముఖం.. చుట్టూ రక్తం. భయంకరంగా వుందా దృశ్యం.

కళ్ళు తిరుగుతూన్నట్లూ.. క్రిందికి పడిపోతున్నట్లూ అనిపించింది.

"ఎవరి రూమ్స్ లోకి వాళ్ళు వెళ్ళండి." వార్డెన్ మాటలు ఎక్కడో కొన్ని వేల మైళ్ళ దూరం నుంచి వినిపించాయి. ఎవరో నన్ను పట్టుకుని రూం లోకి తీసుకురావడం లీలగా తెలిసింది.

స్పృహ వుందో లేదో నాకే అర్థం కాని స్థితిలో మంచం మీద వాలిపోతుంటే, నా మనసులో దివ్య జ్ఞాపకాలు రివ్వున తిరిగాయి.

*****

"నువు రానంత సేపూ
   తుపానులో చిక్కిన చిగురుటాకు..
నీ చూపు సోకితే చాలు
   తనువు పండిన గోరింటాకు."

మంచం మీద బోర్లా పడుకుని, పిండుమీద ఎడమ మోచేతిని, ఆ అరచేతిలో చెక్కిలినీ ఆన్చి.. డైరీ వ్రాసుకుంటోంది దివ్య.
రేడియోలో వినిపిస్తూన్న పాటకి అనుగుణంగా ఆమె పాదాలు వూగుతున్నాయి.
"..ఔరా అని రామయ కన్నులు మేలమాడి నవ్విన చిన్నెలు చూసి అలకలొచ్చిన కలికీ..."
ఏదో మధుర భావాన్ని మనసు పొరల్లో నిక్షిప్తం చేసుకుని, తాళం వేసుకుంటూన్నట్లూ...
దివ్య కళ్ళు మూసుకుంది. పెదవులు చిరునవ్వుతో మెరుస్తూంటే, అప్పటివరకూ ఆ పెదవులతో ఆడుకున్న పెన్నుని అలాగే పుస్తకంలోకి వదిలేసి వెల్లకిలా తిరిగింది.
కలల లోకంలోకి మెల్లమెల్లగా జారిపోతున్నాను కదిలించకండి.. అని చెప్పేందుకో.., ఆ కలలకు పరవశించిన చెక్కిలి ఎరుపును కవర్

చేసుకునేందుకో.., కుడిచేతిని మడిచి కళ్ళపై ఆనించుకుంది.
అదను కోసం చూస్తున్న నేను చటుక్కున వంగి, డైరీ అందుకున్నాను.
రోజూ డైరీ రాయదు దివ్య. ఎపుడో యిలా .. మనసు ఆనందంతో పూగిపోతూన్నపుడు.. ఆ భావాలన్నిటినీ చిన్న చిన్న కవితలలో పేర్చి అందులో ఎక్కిస్తుంది.
నేనేమో వాటిని దొంగతనంగా చదివేస్తూంటాను.

"విరహపు వాకిట్లో
    విరికొమ్మలా నే నిలుచుంటే..
వైణికుడు వాయులీనాన్ని చూసినట్లూ
    అలా చిత్రంగా చూస్తావే!
నీ వూపిరి తాకినా చాలు
    నాలో వర్ణాలు పలుకుతాయని..
అయ్యో! నీకెవరూ చెప్పరే!"

చదివి అప్రయత్నంగా "ఓసినీ!" అన్నాను నేను గొంతులో ఆశ్చర్యం ధ్వనిస్తుండగా. దివ్య వులిక్కిపడి కళ్ళు తెరిచింది. నా చేతిలో వున్న డైరీని చూడగానే కెవ్వుమని అరిచింది.
దాన్ని లాక్కుని దిండు క్రింద దాచుకుంటూ "డైరీ చదవకూడదని తెలీదూ! ఇడియట్" అని కసురుకుంది.
"చాల్లేవోయ్ నాకా మాత్రం హక్కులు వున్నాయి." కొట్టిపారేశాను నేను.
మంచం మీద వెనక్కి చేరగిలబడుతూ అన్నాను. "మొత్తానికి చాలా దూరం వచ్చిందన్నమాట నీప్రేమ. చాలా నేర్పించాడు సుధాకర్ నీకు." అని.
"నీ మొహంలే, నోరు మూసుకో." అది కోపం నటించింది .

దాన్ని చూస్తే ముచ్చటేసింది నాకా క్షణంలో. దివ్యలో అంత ఆనందాన్ని నింపిన సుధాకర్ మీద అభిమానం కలిగింది.

కాలేజ్‌లో చేరిన కొత్తల్లో యిలా వుండేది కాదు దివ్య. దిగులు దిగులుగా.. మాటలే రాని దానిలా.. ఎవరి ప్రాణాన్నో బలవంతంగా మోస్తూన్న దానిలా.. వుండేది.

నేను ఎంతో ప్రయత్నం చేశాక కొంచెం కొంచెంగా మనుషుల్లో పడింది. అదికూడా ఓ ఆరునెలలకి.

ఇప్పటికి అది నాతోనే కాస్త మనసు విప్పి మాట్లాడుతుంది. మిగతా వాళ్ళందరి దగ్గరా మౌనమే.

ద్వేషం తప్ప మరేమీ చూపించని సవతితల్లి.., ప్రేమ, ఆప్యాయత లాంటి భావాలు ఏమాత్రం కనిపించనీయని తండ్రీ.. ఆ పెంపకంలో ఎవరైనా అలాగే తయారవుతారేమో! కనీసం ఉత్తరాలు కూడా వచ్చేవి కాదు దానికి.

ప్రతి నెలా మొదటివారంలో ఏడొందల రూపాయల మనిఆర్డర్ మాత్రం వచ్చేది. మా ముసలి పోస్ట్‌మాన్ కరక్టుగా పట్టుకొచ్చి యిచ్చేవాడు. "దివ్యమ్మా! డబ్బులొచ్చాయి" అంటూ.

దివ్య ఏడ్చేసేది. "జ్యోత్స్నా! ఈ ప్రపంచంలో నాకు ఒక నాన్న వున్నాడనీ, ఈ డబ్బులు ఆయన పంపిస్తున్నాడనీ కూడా అనిపించదే నాకు. ఈ పోస్ట్‌మానే యిస్తున్నట్లుగా వుంటుంది. కనీసం ఈ పోస్ట్‌మాన్ మాట్లాడినంత ఆప్యాయంగా కూడా మా నాన్న నాతో ఎపుడూ మాట్లాడలేదు."

దాని బాధ నాకు అర్థం అయ్యేది. తమకి సంబంధించిన మనిషికి ఆమాత్రం ప్రేమ అందివ్వలేని వాళ్ళు అసలు మనుషులేనా! అనిపించేది.

పైకి మాత్రం "అలా అనుకోకు దివ్యా! ప్రేమని ప్రకటించడం అందరికీ చేతకాదు. ఎంతయినా ఆయన నీకు కన్నతండ్రి. నీమీద ఆయనకి ప్రేమ

లేకుండా ఎలా వుంటుంది చెప్పు!" అనేదాన్ని.

"లేదు జ్యోత్స్నా. నీకు తెలీదు. నువు మా యింటికి వస్తే అర్థం అవుతుంది. నాన్నా, పిన్నీ, తమ్ముడూ, చెల్లీ.. వాళ్ళంతా.. వాళ్ళు మాత్రమే ఒక కుటుంబంలా వుంటారు.

అసలు నేనెవర్నో, నాకూ ఆ యింటికీ ఏమైనా సంబంధం వుందో, లేదో నాకెప్పుడూ అర్థం కాదు. తమ్ముడితో, చెల్లెలితో ప్రేమగా మాట్లాడే నాన్న, నాతో మాట్లాడుతుంటే చాలా అసహజంగా వుంటుంది. ఎవరో పరాయి పిల్లతో మాట్లాడుతున్నట్టుగా.." దుఃఖంతో దాని గొంతు పూడుకుపోయేది.

"జ్యోత్స్నా! నువ్వన్నట్లూ మానాన్నకి నామీద కూడా ప్రేమ వుందేమో. ఎంతో కొంత వుందేమో. కానీ.. కానీ.. నాకా ప్రేమ చాలదే. నిజంగా చాలదు."

అది కన్నీళ్ళతో చెప్తుంటే నేను నిస్సహాయంగా చూసేదాన్ని.

అలాంటి దివ్య సుధాకర్ పరిచయంతో చాలా మారింది.

యాన్యువల్ డేకి "ఉషా పరిణయం" నాటకం వేశాం. అది ఉష. అతను అనిరుద్ధుడు. నేనే చిత్రలేఖని.

రోజూ రిహార్సల్స్. నాటకం ప్రదర్శన పూర్తయ్యేసరికి, వీళ్ళ ప్రేమ పాకంలో పడింది.

ఎదురుగా వున్నది మగపిల్లాడయితే తలని ఆరడుగుల లోతుకి వంచేసుకునే దివ్యని, అసలు అతను ఎలా లైన్లో పెట్టాడా! అనేది నాకు యిప్పటికీ సస్పెన్సే.

అందులోనూ ఎప్పుడూ దాన్ని అంటిపెట్టుకుని వుండే నా కళ్ళు కప్పి! ఏమైనా సుధాకర్‌కి దివ్య అంటే చాలా ప్రేమ. అసలు అందంగా వుండే దివ్య అంటే మగపిల్లలందరికీ ఆరాధనే. సుధాకర్ ప్రేమ యింకొంచెం గట్టిది అన్నమాట.

దివ్య దృష్టిలో అయితే యింతకన్నా గొప్పవాడిని దేవుడు యింతవరకూ సృష్టించలేదు. ఇక ముందు సృష్టించబోడు.
కాకపోతే ఒకటే చిక్కు. సుధాకర్‌ది వేరే కాస్ట్. అతన్ని పెళ్ళి చేసుకోవడానికి దివ్య వాళ్ళ నాన్న ఒప్పుకోడు.
"ఏమిటండీ వాళ్ళు ఒప్పుకునేది! మా యిద్దరికీ యిష్టమయినపుడు కాదనడానికి వాళ్ళెవరు? ఈ రోజుల్లో కూడా కులాన్ని పట్టించుకునే మూర్ఖులని అసలు లెక్క చేయకూడదు" అన్నాడు సుధాకర్ ఆవేశంగా.
"పెద్దవాళ్ళన్నాక వాళ్ళ సిద్ధాంతాలు, ఆలోచనలు వాళ్ళకి వుంటాయి కదా!" అన్నాను నేను.
"ఉండనివ్వండి. ఉంటే ఏం చేస్తారు? మమ్మల్ని వాళ్ళ యింటికి రానివ్వరు. అంతేగా! మాకేం బాధ లేదు. పెళ్ళయ్యాక అసలు మేమే వాళ్ళ గడపలో అడుగుపెట్టం"
నేను చటుక్కున తలతిప్పి దివ్య వైపు చూశాను. అదికూడా అతని మాటలతో ఏకీభవిస్తున్నట్లే అనిపించింది. దాని మొహంలో బాధ లాంటిది ఏమీ కనిపించలేదు.
"పోన్లే. వాళ్ళిద్దరూ అంత గట్టిగా వుండగలిగితే మంచిదే" అనిపించింది నాకు. ఇంకా చెప్పాలంటే.. అది అంత గట్టిగా, గుడ్డిగా ప్రేమలో పడిపోవడం, జీవితం అంటే మూడు కృష్ణశాస్త్రి గీతాలు, ఆరు నండూరి పాటలు అనుకోవడం.. ఇదంతా నాకు చాలా రిలీఫ్‌నిచ్చింది.
ఇద్దరూ కలిసి సినిమాలు, షికార్లు, గుళ్ళు, గోపురాలు.. తెగ తిరిగేస్తున్నారు.
అతని చదువు ఆయిపోయింది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. రేపు దివ్య ఎగ్జామ్స్ కూడా అయిపోగానే పెళ్ళి చేసుకుంటారట.
ఈరోజు యింకా బయల్దేరలేదేమిటో యిది! అనుకున్నాను. నేను అడిగేలోపూ

తనే చెప్పింది.
"సుధాకర్ ఫోన్ చేశాడు, ఆరుగంటలకి బిర్లామందిర్‌కి రమ్మని."
"నిన్న ఎందుకు రాలేదుట?" అడిగాను నేను.
"ఏమో చెప్పలేదు. అక్కడికి వచ్చాక చెప్తాలే అన్నాడు"
"పోట్లాడలేదా నువ్వు!" నవ్వుతూ అడిగాను.
అది కూడా నవ్వేసింది.
"ఏం చెప్తావు? నిన్న నువు రాలేదని చాలా దిగులుపడ్డాను అని చెప్తావా!"
నేను క్యూరియస్‌గా అడుగుతుంటే, దాని కళ్ళు అల్లరిగా మెరిశాయి.
"ఊ. ఒక్కరోజు నువు రాకపోతే దిగులుతో నాగుండె ఆగిపోతుందన్న అబద్ధం.. నీకు ఆనందాన్నిస్తుంది.
నిజానికి అది లక్ష సార్లకు పైగా కొట్టుకుంటుందనీ.. ప్రతీ ఒక్కసారీ లెక్కపెడ్తే.. ఒకరోజవుతుందనీ.. నీకెప్పుడు అర్ధమవుతుంది!!.. అని అడుగుతాను"
చీర కట్టుకుంటూ సమాధానం చెప్పింది. ఎల్లో కలర్ షిఫాన్ శారీ. సుధాకర్‌కి యిష్టమయిన చీర.
కుచ్చెళ్ళు సర్దుతూ అడిగాను "పెళ్ళెప్పుడట?"
"అది కూడా అక్కడికి వచ్చాక చెప్తానన్నాడు"
నా చేత జడ వేయించుకోవడం అయ్యాక "వెళ్ళనా!" అంది.
"ఊ. త్వరగా వచ్చేయి" చెప్పాను నేను.
అయిదున్నరకి వెళ్ళి ఎనిమిదిన్నరకి తిరిగొచ్చింది.
వెళ్ళేటపుడు వున్న హుషారు వచ్చేటపుడు లేదు. నీరసంగా, సర్వం కోల్పోయినదానిలా రూమ్‌లోకి అడుగుపెడుతున్న దానిని చూస్తే నాకు మతిపోయింది.
"ఏమయిందే!" అన్నాను.

సమాధానం చెప్పలేదు. రెండు కాళ్ళూ మంచం మీద పెట్టుకుని, మోకాళ్ళపై తల ఆనించి గువ్వలా కూర్చుంది.

"ఏమైంది! పోట్లాడుకున్నారా!" మంచినీళ్ళు తెచ్చిస్తూ మళ్ళీ అడిగాను.

దాని కళ్ళలో చివ్వున నీళ్ళుబికాయి.

"పెళ్ళి గురించి మాట్లాడుకున్నారా!" ఆత్రుతగా దాని భుజం పట్టుకుని ఊపాను.

"ఊ. ఇప్పుడు కాదు." తల నిస్త్రాణగా గోడకి ఆనించుకుంది. మూసుకున్న కళ్ళలోనుంచి రెండు నీటిబొట్లు జలజలా రాలాయి.

నా మనసు కీడు శంకించింది. "ఏమయింది! వాళ్ళ వాళ్ళు ఒప్పుకోలేదా!"

"..."

"కట్నం కావాలటనా!"

"...."

"ఇంకెవరినైనా చేసుకోమంటున్నారటనా!"

"..."

కథా నిలయం
4718
శ్రీకాకుళం

"సమాధానం చెప్పవే.." దాని చేయి పట్టుకుని లాగుతూ అరిచాను గది దద్దరిల్లేలా...

కళ్ళు మూసుకునే గడగడా చెప్పింది అది.

"ఏం లేదు. ఉద్యోగం దొరకడం కష్టంగా వుందట. వాళ్ళ నాన్నని అడిగి నలభై వేలు తీసుకుని కంప్యూటర్ నేర్చుకుంటాడట. ఎగ్జామ్స్ అవగానే నన్ను వూరికి వెళ్ళిపోమన్నాడు. తనకి ఉద్యోగం దొరికాక లెటర్ వ్రాస్తాడట. అప్పుడు రమ్మన్నాడు. ఈ లోపల వీలయితే నన్ను కూడా ఏదైనా కోర్స్ చేయమన్నాడు.. మా నాన్న డబ్బులతో."

నేను నివ్వెరబోయి చూస్తుంటే నెమ్మదిగా కళ్ళు తెరిచింది అది. అభావంగా చూస్తూ చెప్పింది. "అంతే. ఇప్పుడే పెద్దవాళ్ళకి చెప్పేయడం, పెళ్ళి

చేసుకోవడం, వుద్యోగం లేకుండా కష్టాలు పడడం.. తెలివితక్కువతనం అన్నాడు. ఒక సంవత్సరం ఆగుదాం. అప్పటివరకూ మీనాన్ననీ, మా నాన్ననీ యింకొంచెం ఉపయోగించుకుందాం అన్నాడు. అంతే. ఇంకేం లేదు. అంతకంటే యింకేం లేదు."

మాట పూర్తవుతూండగానే దాని గొంతులోనుంచి దుఃఖం తన్నుకొచ్చింది. ఒక్కసారిగా నా వళ్ళో తలదాచుకుని భోరుమంది. చాలాసేపు ఏడుస్తూనే వుంది. దాని తల మీద చేయి వేసి శిలలా కూర్చుండిపోయాను నేను.

ఏడ్చి ఏడ్చి, పొమ్మసిల్లి ఎప్పటికో నిద్రపోయింది.. అలాగే నా వడిలోనే.

ప్రొద్దున్నే నేను త్వరగా లేచి, రెడీ అయిపోయాను. దానికోసం ఫ్లాస్క్‌లో కాఫీ పోసి వుంచి, కాలేజీకి వెళ్ళిపోయాను.

ఆ తర్వాత.. ఆ తర్వాత కాసేపటికి.. అక్కడ నేను కెమిస్ట్రీ లాబ్‌లో వుండగా.. ఇక్కడ అది...

*****

దివ్య చనిపోయి నెలరోజులవుతోంది. అందరూ వచ్చారు. వాళ్ళ నాన్నా, పిన్నీ, సుధాకర్...

సుధాకర్ అయితే వెంటనేనే వచ్చాడు. దివ్య శవాన్ని పడిపోయిన చోటు నుంచి కదిలించకముందే.

ఆ దృశ్యం చూసి చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. అతన్ని పట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాలేదు.

అందాల దివ్య, తన కలల దేవత.. అంత భయంకరమైన మరణాన్ని ఎందుకు కోరుకుందో అతనికి అర్థం కాలేదు.

అతన్నీ, అతని ప్రేమనీ చూసి హాస్టల్‌లో ప్రతి అమ్మాయీ కదిలిపోయింది.

"ఎంత మంచివాడు! ఇతని కోసమన్నా బ్రతకాలనిపించలేదా దివ్యకి! అయినా

అసలు తనకేం కష్టాలున్నాయని!" ఒక అమ్మాయి బాధ.

"వేరే కష్టాలు ఏముంటాయి? ఇతనితోనే ఏమన్నా గొడవ పడిందేమో!" మరొకరి అనుమానం.

"నీ మొహం. అసలు అతను గొడవ పెట్టుకునే మనిషిలా కనపడుతున్నాడా!"

"ఏం లేదుట. పెళ్ళి చేసుకోమంటే ఇంకొన్నాళ్ళు ఆగుదాం అన్నాడట. అంతే. కోపంగా వచ్చేసిందట."

"ఇరవై ఏళ్ళు కూడా లేవు. అపుడే పెళ్ళికి ఏం తొందర వచ్చిందో! అయినా ఆ మాత్రానికే..."

వాళ్ళ మాటలు వింటుంటే నాకు కడుపులో దుఃఖం సుళ్ళు తిరిగింది.

"ఆ మాత్రం" అవును. ఆమాత్రానికే చచ్చిపోయింది దివ్య. ఒక అమ్మాయికి. . తను ప్రేమించిన వాడు అడవులకి పంపించిన రాముడికన్నా, అమ్మేసిన హరిశ్చంద్రుడి కన్నా గొప్పవాడనీ, పురుషోత్తముడనీ నమ్మిన అమ్మాయికి.. అతనిలో కనిపించిన ఆమాత్రం స్వార్థం చాలు, ప్రాణాలు వ్యర్థం అనిపించడానికి.

తను మేరుపర్వతంలా వూహించుకున్న వ్యక్తిత్వం.. ఒక పేకమేడ అన్న నిజం చాలు.. గుండె బ్రద్దలయిపోవడానికి.

మీకెవరికీ అర్థం కాకపోవచ్చు. కానీ నాకు మాత్రం అదిగో.. ఆ ఏడుపే వినిపిస్తోంది.. నా గుండెల్ని పిండేస్తూ..

చీకట్లో.. పర్వతాల మధ్య నుంచి ఉధృతంగా పారే ఒంటరి నదిలా.. ఎక్కడో ఏ గుహాంతరాళగంలోనో శతాబ్దాల నుండీ శిలగా వున్న నాట్య సుందరి కన్నీళ్ళతో చేసే జతిలా..

నాకింకా వినిపిస్తూనే వుంది. ఆమె ఏడుపు నాకింకా వినిపిస్తూనే వుంది.

*****

("పల్లకి" వినూత్న వారపత్రిక - 13.10.1993)